

# ఉద్యోగం పేరిట దారుణం

## వివాహితను రూ. 2 లక్షలకు అమ్మేసిన ఏజెంట్లు!

**3 నెలల పసిబిడ్డ ఉన్న మహిళపై అమానుషం.. బలవంతపు పెళ్లి**

**300 మంది గ్రామస్తులను ఎదిరించి బాధితురాలిని రక్షించిన పోలీసులు**

**సమయం న్యూస్, ముంబై:** మహారాష్ట్రలోని నాసిక్ జిల్లా సత్పూర్ ప్రాంతంలో పేదరికాన్ని ఆసరాగా చేసుకుని ఒక మహిళను విక్రయించిన షాకింగ్ ఘటన వెలుగులోకి వచ్చింది. ఈవెంట్ మేనేజ్‌మెంట్ కంపెనీలో పని ఇప్పిస్తామని నమ్మించి, ఇద్దరు మహిళా ఏజెంట్లు ఒక వివాహితను రూ. 2 లక్షలకు విక్రయించి, బలవంతంగా పెళ్లి చేశారు. వివరాల్లోకి వెళితే.. సత్పూర్‌కు చెందిన బాధితురాలు తన భర్త నుంచి విడిపోయి, 3 నెలల పసిబిడ్డతో కలిసి జీవిస్తున్నది. ఆర్థిక ఇబ్బందుల్లో ఉంది. దీనిని ఆసరాగా చేసుకున్న రాణి, భాగి అనే ఇద్దరు మహిళా ఏజెంట్లు.. ఫిబ్రవరి 27న ఆమెకు ఈవెంట్ మేనేజ్‌మెంట్‌లో మంచి ఉద్యోగం ఇప్పిస్తామని నమ్మబలికారు. ఆమెను మాలేగావ్ మీదుగా నందగావ్ తాలూకాలోని జాతేగావ్‌కు తీసుకువెళ్లారు. అక్కడికి చేరుకున్న తర్వాత సదరు ఏజెంట్లు నవనాథ్ ఖిరాద్కర్ అనే వ్యక్తి నుంచి రూ.2 లక్షలు తీసుకుని, బాధితురాలిని అప్పగించి, అతనితో ఆమెకు బలవంతంగా పెండ్లి చేశారు. ఫిబ్రవరి 28న మొదటి రాత్రి అనంతరం, బాధితురాలు అక్కడి నుంచి తప్పించుకుని తన తల్లికి ఫోన్ చేసి జరిగిన ఘోరాన్ని వివరించింది. బాధితురాలి తల్లిదండ్రుల ఫిర్యాదుతో సత్పూర్ పోలీసులు తక్షణమే రంగంలోకి దిగారు. జాతేగావ్ గ్రామానికి చేరుకోగా, సుమారు 300 మంది గ్రామస్తులు పోలీసులను అడ్డుకునే ప్రయత్నం చేశారు. అయినప్పటికీ, పోలీసులు ధైర్యంగా ముందుకు వెళ్లి బాధితురాలిని, ఆమె బిడ్డను సురక్షితంగా రక్షించారు. ఈ భారీ రాకెట్‌కు సంబంధించి ఇద్దరు మహిళా ఏజెంట్లను పోలీసులు ఇప్పటికే అరెస్ట్ చేశారు. ఈ కేసులో మరో ఆరుగురిపై కేసులు నమోదు చేసి దర్యాప్తు ముమ్మరం చేశారు. నిస్సహాయ మహిళలను లక్ష్యంగా చేసుకుని సాగుతున్న ఈ విక్రయాల వెనుక ఉన్న మరిన్ని ముఠాల కోసం పోలీసులు గాలిస్తున్నారు.

# విద్యుత్ సరఫరా ధరల ప్రతిపాదనలపై నేడు బహిరంగ విచారణ

**సిరిసిల్ల సహకార విద్యుత్ సరఫరా సంస్థ సెస్ మేనేజింగ్ డైరెక్టర్ భిక్షపతి**

**సమయం న్యూస్, సిరిసిల్ల :** విద్యుత్ ఆదాయ ఆవశ్యకత రిటైల్, సరఫరా ధరల ప్రతిపాదనలపై బుధవారం బహిరంగ విచారణ నిర్వహిస్తున్నట్లు సిరిసిల్ల సహకార విద్యుత్ సరఫరా సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ బి. బిక్షపతి ప్రకటనలో వెల్లడించారు. తెలంగాణ విద్యుత్ నియంత్రణ మండలి వారు సిరిసిల్ల సహకార విద్యుత్ సరఫరా సంఘం(సెస్) 2026 -27 ఆర్థిక సంవత్సరానికి సవరించబడిన ఆదాయ ఆవశ్యకత రిటైల్ సరఫరాల ధరల ప్రతిపాదనపై ఈనెల 4వ తేదీ ఉదయం 10-30 గంటల నుండి సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం కలెక్టరేట్ సమావేశ మందిరంలో బహిరంగ విచారణ జరుపుతున్నట్లు తెలిపారు. ఆసక్తిగల విద్యుత్ వినియోగదారులందరూ ఈ బహిరంగ విచారణకు హాజరుకావాలని సెస్ మేనేజింగ్ డైరెక్టర్ కోరారు.

# తండ్రి ఫోన్ తీసుకున్నాడని 13 ఏళ్ల బాలుడి ఆత్మహత్య

**సమయం న్యూస్, ముంబై:** తండ్రి మొబైల్ ఫోన్ లాక్కున్నాడనే కోపంతో 13 ఏళ్ల బాలుడు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన మహారాష్ట్రలోని షోలాపూర్ జిల్లాలో తీవ్ర విషాదాన్ని మిగిల్చింది. వివరాల్లోకి వెళితే.. మొహోల్ తాలూకాలోని పెనూర్ గ్రామానికి చెందిన ధర్మరాజ్ డోకే వ్యవసాయం చేస్తూ జీవనోపాధి పొందుతున్నాడు. తన కుమారుడు యశ్‌రాజ్ మొబైల్‌ను అధికంగా వినియోగిస్తున్నాడని భావించి ఫోన్‌ను తీసుకున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. యశ్‌రాజ్ పదేపదే ఫోన్ ఇవ్వాలని అడిగినా, భవిష్యత్తుపై ఆందోళనతో తండ్రి నిరాకరించాడు. దీంతో ఆగ్రహానికి లోనైన బాలుడు ఇంట్లోని ఓ గదిలోకి వెళ్లి తల్లి చీరతో ఇనుప యాంగిల్‌కు ఉరి వేసుకున్నాడు. అనుమానం కలగడంతో కుటుంబ సభ్యులు తలుపు తట్టినా స్పందన రాకపోవడంతో ఇనుప రాడ్‌తో తలుపులు పగలగొట్టి లోపలికి వెళ్లి చూడగా బాలుడు ఉరివేసుకున్నట్లు గమనించారు. అతన్ని వెంటనే సమీప ప్రైవేట్ ఆసుపత్రికి, అనంతరం మొహోల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. ఈ ఘటనపై బాలుడి బంధువు అబా దత్తాత్రే డోకే ఫిర్యాదు మేరకు పోలీసులు ప్రమాదవశాత్తు మరణం కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ఘటనపై స్థానికంగా తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తమవుతోంది.

# వేములవాడ డీఎస్పీగా శ్రీనివాసులు బాధ్యతల స్వీకరణ

**సమయం న్యూస్, వేములవాడ :** వేములవాడ సబ్ డివిజన్ కార్యాలయంలో నూతన డీఎస్పీగా శ్రీనివాసులు బాధ్యతలు స్వీకరించారు. మంగళవారం ఉదయం కార్యాలయానికి చేరు కున్న ఆయనకు అధికారులు, సిబ్బంది ఆత్మీయ స్వాగతం పలికారు. ఈ సందర్భంగా శ్రీనివాసులు మాట్లాడుతూ ప్రజల భద్రత, శాంతి భద్రతల పరిరక్షణే తన ప్రధాన ల క్ష్యమని తెలిపారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలపై కఠిన చర్యలు తీసుకుంటామని, ప్ర జల సమస్యల పరిష్కారానికి ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని తెలిపారు. అనం తరం పోలీస్ అధికారులు, సిబ్బంది ఆయనకు శుభాకాంక్షలు తెలియజేశారు.



# హోలీ పండుగ రంగుల పండుగ మాత్రమే కాదు.. ప్రజల మధ్య ఐక్యమత్యం పెంచేది

- సిరిసిల్ల మున్సిపల్ చైర్ పర్సన్ జిందం కళా చక్రపాణి
- సిరిసిల్ల పట్టణంలో ఘనంగా హోలీ వేడుకలు పాల్గొన్న మున్సిపల్ కౌన్సిలర్లు, పట్టణ ప్రముఖులు



**సమయం న్యూస్, సిరిసిల్ల :** హోలీ పండుగ కేవలం రంగుల పండగ మాత్రమే కాదు ఇది మనుషుల మధ్య మానవత్వాన్ని ప్రేమ అనురాగాన్ని ఆప్యాయతలు ఐకమత్యాన్ని పెంపొందించే సాంస్కృతిక వేడుక అని మున్సిపల్ చైర్ పర్సన్ జిందం కళ చక్రపాణి అన్నారు. మంగళవారం హోలీ పర్వదిన వేడుకలు సిరిసిల్ల పట్టణంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వేడుకల్లో పాల్గొన్న మున్సిపల్ చైర్పర్సన్ కళా చక్రపాణి మాట్లాడుతూ చెడు లక్షణాలను వదిలించుకొని మంచి లక్షణాలతో ఆదర్శప్రాయ-ంమైన జీవితాన్ని ప్రతి ఒక్కరు గడపాలని ఆకాంక్షించారు. ఈ హోలీ పండుగ సందర్భంగా ప్రజా ప్రతినిధులకు, పుర ప్రముఖులకు, సిరిసిల్ల ప్రజలందరికీ హోలీ పండుగ శుభాకాంక్షలు తెలుపుతూ ప్రతి ఒక్కరూ ప్రశాంత వాతావరణంలో కుటుంబ సభ్యులతో బంధుమిత్రులతో సంతోషంగా పర్యావరణానికి అనుకూలమైన రంగులను వాడుతూ ఈ హోలీ పండుగ సంతోషంగా నిర్వహించుకోవాలని కోరారు. ఈ సందర్భంగా బీ ఆర్ఎస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు జిందం చక్రపాణి గారు మాట్లాడుతూ సిరిసిల్ల పుర ప్రముఖులకు నాయకులకు పట్టణ ప్రజలకు టిఆర్ఎస్ పార్టీ కుటుంబ సభ్యులందరికీ హోలీ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్లు, పట్టణ ప్రజలు, యువకులు పాల్గొన్నారు.

# ఐక్యతకు, ఆనందానికి ప్రతీక హోలీ

- చెడుపై మేలు సాధించిన విజయానికి గుర్తు
- ప్రజలతో కలిసి రంగులు పూసుకున్న విప్ ఆది శ్రీనివాస్
- వేములవాడలో హోలీ సంబరాలు



**సమయం న్యూస్, వేములవాడ:** రంగుల పండుగ హోలీని పురస్కరించుకుని వేములవాడ పట్టణంలో సంబరాలు మిన్నంటాయి. మంగళవారం స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన హోలీ వేడుకల్లో రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ పాల్గొని ప్రజలకు, కార్యకర్తలకు హోలీ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ.. హోలీ పండుగ మన భారతీయ సంస్కృతిలో ఐక్యత, సౌభ్రాతృత్వం మరియు ఆనందాన్ని ప్రతిబింబిస్తుందని పేర్కొన్నారు. కులమతాలకు అతీతంగా అందరూ కలిసి జరుపుకునే ఈ పండుగ మానవ సంబంధాలను మరింత బలపరుస్తుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. "హోలీ అనేది చెడుపై మేలు సాధించిన విజయానికి సూచిక. ఈ రంగుల పండుగ ప్రతి కుటుంబంలో కొత్త వెలుగులు నింపాలి. ప్రజలందరూ సుఖశాంతులతో, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని కోరుకుంటున్నాను" అని విప్ ఆకాంక్షించారు. అనంతరం కార్యకర్తలు, స్థానిక నాయకులతో కలిసి ఆయన రంగులు చల్లుకుంటూ ఉత్సాహంగా గడిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.

# నేడు సిరిసిల్ల ఇస్కాన్ ఆధ్వర్యంలో గౌరపూర్ణిమ వేడుకలు



**సమయం న్యూస్, సిరిసిల్ల :** అంతర్జాతీయ కృష్ణ చైతన్య సంఘం (ఇస్కాన్) ఆధ్వర్యంలో బుధవారం తంగళ్లపల్లి మండలం నేరెళ్ల గ్రామ ఇస్కాన్ నూతన మందిరంలో శ్రీకృష్ణ చైతన్య మహాప్రభు ఆవిర్భావ దినోత్సవం అత్యంత వైభవంగా నిర్వహిస్తున్నట్లు సిరిసిల్ల ఇస్కాన్ ప్రతినిధులు వెల్లడించారు. మంగళవారం సిరిసిల్ల ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలను ప్రకటించారు. ఈ సందర్భంగా ఉదయం 10 గంటల నుండి ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించబడతాయన్నారు. ఈ వేడుకల్లో హరినామ సంకీర్తన, గౌర నితాయ్, కృష్ణ బలరామ మహా అభిషేకం, గౌరకథ ప్రవచనం, మంగళహారతి కార్యక్రమాలు జరుగుతాయన్నారు. భక్తులందరికీ అన్నప్రసాదం పంపిణీ చేస్తారని తెలిపారు. సిరిసిల్ల నుండి విచ్చేసే భక్తుల కోసం ప్రత్యేక బస్సు సౌకర్యం కూడా ఏర్పాటు చేయబడినట్లు ఇస్కాన్ ఇంచార్జ్ ప్రాణనాథ్ అచ్యుత దాస్ ప్రభు గారు తెలిపారు. భక్తులందరూ సకుటుంబ సమేతంగా పాల్గొని ఈ పవిత్ర గౌరపూర్ణిమ మహోత్సవాన్ని విజయవంతం చేయాలని ఇస్కాన్ నిర్వాహకులు ఆహ్వానిస్తున్నట్టు తెలిపారు. ఈ మీడియా సమావేశంలో శ్రీమాన్ ప్రాణనాథ్ అచ్యుత దాస్ ప్రభు, శ్రీమన్ రాకల గోపీశ్వర్ దాస్ ప్రభు, భక్త సాగర్ ప్రభు, వీరేందర్ ప్రభు, సాయికృష్ణ ప్రభు, ప్రణీత్ ప్రభు, సిరిసిల్ల తిరుపతి ప్రభు పాల్గొన్నారు.

# వేములవాడలో కుక్కల స్వైర విహారం

- 25 మందికి గాయాలు
- వింత వ్యాధులతో కుక్కల హల్ చల్

**సమయం న్యూస్, వేములవాడ :** వేములవాడ పట్టణంలో కుక్కల స్వైర విహారం చేస్తున్నాయి. వింత వ్యాధులతో కుక్కలు హల్ చల్ చేస్తుండడంతో స్థానికులు భయాందోళనలకు గురవుతున్నారు. సోమవారం సాయంత్రం నుంచి మంగళవారం ఉదయం వరకు జరిగిన ఘటనల్లో సుమారు 25 మంది వ్యక్తులపై వీధి కుక్కలు దాడి చేసి గాయపరిచాయి. వీరందరూ స్థానిక ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. పట్టణంలోని బద్ది పోచమ్మ వీధి, అర్బన్ కాలనీ, సుభాష్ నగర్ ఏరియా, ధోబి ఘాట్, మార్కెట్ ఏరియాలలో ఈ దాడులు జరిగినట్లు బాధితులు పేర్కొంటున్నారు. బాధితులకు రెబిస్ నిరోధక టీకాలతో పాటు చికిత్స అందిస్తున్నారు. విషయం తెలుసుకున్న వెంటనే మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు, వైస్ చైర్మన్ నరాల శేఖర్, కౌన్సిలర్ ఇప్పపూల మమత అజయ్ లు ఆసుపత్రికి చేరుకుని బాధితులను పరామర్శించారు. వారి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకుని మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు సూచించారు. ఈ సందర్భంగా చైర్మన్ పుల్కం రాజు మాట్లాడుతూ బాధితులకు పూర్తి స్థాయిలో వైద్యం అందేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. మున్సిపల్ పరిధిలో కుక్కల బెడదను తగ్గించేందుకు 15 రోజుల క్రితమే 40 కుక్కలను ఏ.బి.సి కేంద్రానికి తరలించామని తెలిపారు. మరిన్ని కుక్కలను పట్టుకునేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటామని భరోసా ఇచ్చారు.



**వింత వ్యాధులతో బాధపడుతున్న కుక్కలు**

వేములవాడ పట్టణంలో వీధి కుక్కలు వింత వ్యాధులతో తిరుగుతున్నాయి. చర్మం ఊడిపోయి వింత వ్యాధులతో ప్రజల మీదకు రావడంతో ప్రాణాంతకంగా మారే అవకాశం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గతంలో కూడా వీధి కుక్కల దాడులు జరిగిన నేపథ్యంలో వేములవాడ వాసులు వీధుల్లో తిరగడానికి జంకుతున్నారు.

